# తిల్లానా

## కొడవంటి కాశీపతిరావు

ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంటులోనుండి దిగేసరికి ఎదురుగా నిల్చున్న జనసమూహాన్ని చూసి నిశ్చేష్టుడైపోయాడు శివశంకరం. ఆహ్వానించడానికి అంతమంది వేచి వుంటారనుకోలేదు. పైగా అందరిచేతుల్లోనూ పూలదండలో, పూలగుత్తులో సాదరంగా స్వాగతం పలుకుతున్నాయి. హృదయం ఉప్పొంగిపోతుంటే రెండు చేతులూ జోడించి నమస్కరిస్తూ వుండిపోయాడు శిలావిగ్రహంలా. పూలదండల్తో ముఖం కనిపించని ఆ శిలావిగ్రహాన్ని రైల్వేస్టేషన్లో ఎందుకు ప్రతిష్ఠించేరో నన్నట్టుగా ప్లాట్‌ఫారంమీది జనం ఎగబడ్డారు. ఎగబడిన జనానికి కొంతసేపటికి అర్థమైంది... అది శిలావిగ్రహం కాదు...ప్రఖ్యాత సంగీత విద్వాంసుడు శివశంకరమని.

స్టేషను బయటికివచ్చి మరింత ఆశ్చర్యపోయేడు శివశంకరం. 'త్యాగరాయ గానసభ' పేరుతో ఉన్న బేనర్ పట్టుకుని కార్యకర్తలూ...వెనకగా సన్నాయి వాయిద్యమూ...ఆ వెనుక జీపుమీద శివశంకరమూ...అట్టహాసంగా గమ్యం చేరుకున్నారు. స్వాగతమే ఇంత పెద్దయెత్తున చేస్తే కచేరీ, సత్కారాలు ఇంకెంత గొప్పగా ఉంటాయో అన్న ఆలోచన వచ్చింది. ప్రజాదరణ తగ్గిపోతున్న సంగీతానికీ, తన వంటి సంగీత విద్వాంసులకూ దేశంలో ఇంకా ఏమూలనో కాస్తంత చోటు ఉన్నందుకు కళ్ళు చెమర్చాయి శివశంకరానికి.

కనుచీకటి పడుతోంది.

మర్నాడు ప్రారంభంకానున్న సంగీతోత్సవాలకి సన్నాహాల తుదిమెరుగులు దిద్దుతున్నారక్కడ.

"శివశంకరంగార్ని మా ఇంటిలో విడిది చేయమనికోరేం. కాని సాధన చేసుకోడానికనుకూలమైన వాతావరణం ఉంటుందని ఈ ఆవరణలో ఉంటానన్నారు. అంచేత ఆ భాగ్యం నాకు కలగలేదు..." అని అధ్యక్షులవారు ఎవరితోనో అంటున్న మాటలు లీలగా వినబడుతోంటే తనపట్ల అక్కడివారికున్న ఆదరాభిమానాలకి పొంగిపోయేడు శివశంకరం.


"ఇక మీరు విశ్రమించండి... మేం సెలవు తీసుకుంటాం..." అన్నారు అధ్యక్షులవారు.

"మంచిది. మీకు శ్రమ ఇచ్చానులాగుంది."

"ఎంతమాట...మీకేదైనా అవసరమైతే చూడటానికి ఇదిగో ఈ వెంకడు ఇక్కడే వుంటాడు. మొహమాట పడకండి. ఆజ్ఞాపిస్తే చిటికెలో చేసేస్తాడు. వెళ్ళొస్తాం...తిరిగి ఉదయాన దర్శనం చేసుకుంటాం..." అంటూ వెళ్ళిపోయేడాయన.

కొంతసేపటివరకూ కార్యకర్తలకేవేవో సూచనలిస్తూ, పనివాళ్ళకి పనులు పురమాయిస్తూ అధ్యక్షులవారి గొంతు విన్పించింది. ఆ తర్వాత వెళ్ళిపోయినట్టున్నారు సద్దుమణిగింది. అప్పుడు లేచి స్నానంచేసి బట్టలు మార్చుకున్నాడు శివశంకరం.

పట్టు లుంగీమీద పట్టులాల్చీ వేసుకున్నాడు. ఆపైన ఆకుపచ్చని ఉన్ని



శాలువా కప్పుకున్నాడు. బయటికి వచ్చాడు. ఊళ్ళో ఎక్కడాశబ్దం వినిపించడం లేదు. బాగా రాత్రయ్యిందేమో వెన్నెల వెలుతురు పరచుకుంది.

అంతదూరంలో రేపు కార్యక్రమం జరుగనున్న భవన ప్రాంగణం కనిపిస్తోంది. చుట్టూరా చలవపందిళ్ళు వేయిస్తున్నారు. చల్లగా వుండటానికి కాదు. చల్లని రాత్రివేళ మెల్లగావీచే సంగీత మారుతానికి వణికిపోకుండా ఉండటానికి—పందిళ్ళమీద కూలివాళ్ళు ఎక్కి పరదాలు కడుతున్నారు.

"తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవ్వరని" వేసిన కవిప్రశ్న అంకుశంలా గుచ్చుకుంది శివశంకరానికి.

అవును. రేపు తాను పాడుతూంటే ఖరీదైన మనుషులు సుఖంగా ఆ పందిళ్ళకింద కూర్చుని కడుపునిండిన శరీరాలనే కాదు కష్టాలుసోకని మనసునికూడా ఆనందింప జేసుకుంటారు.

జాలిదృష్టితో అలా చూస్తూండిపోయారు.

"బాబేటి కావాలేటి బాబూ."

ఎప్పుడొచ్చి నిలబడ్డాడో ఎంతో వినయంగా చేతులు కట్టుకుని వంగి మరీ అడిగేడు వెంకడు.

వాడికేసి కన్నార్పకుండా చూసేడు శివశంకరం.

ముతకపంచె ఎగ్గట్టుకున్నాడు దానిమీద వేసుకున్న సైనుబనీను ఘాసివుంది. తలక్కట్టుకున్న తలపాగానిండా అంతవరకూ పడిన కష్టానికీ, చేసిన పనికీ లంకెలా చెమటతో కూడిన మట్టితో ముఖం మకిలిబారి ఉంది. ఎంత కష్టమైనా చేస్తాం కడుపునిండా కూడు దొరికితే మహరాజు నన్నంత దిగులులో కూడిన ధీమా అతని ముఖంలో ప్రస్ఫుటమౌతోంది.

"ఏటిబాబూ...ఏటీ సెప్పేనారుకాదు పనాగిపోతంది..." అంటూ అటువేపు చూసేడు వెంకడు.

వెంకడు వచ్చెయ్యడంతో అక్కడ పనివాళ్ళుకూడా పనాపేసి చుట్టలు ముట్టించుకుని కబుర్లాడుకుంటున్నారు.

"అబ్బే...పనేంలేదు. నీపని చూసుకో..." అన్నాడు గంభీరంగా.

"సిత్తం..." అంటూ వినయంగా వంగునిలేచి వెళ్ళిపోయేడు వెంకడు.

అతడు వెళ్లినవేపే కాసేపు చూస్తూ నిల్చున్నాడు.

మనసులో తరంగాలు తరంగాలుగా నాదం ఉబికుబికి తన్నేస్తోంది.

అవును !

ఆ మర్నాడు తాను ఈ కచేరీకి ప్రత్యేకంగా తిల్లానా కూర్చవలసివుంది అన్న సంగతి జ్ఞాపకానికి వచ్చింది.

వెంకడు వెళ్ళేసరికి కూనిరాగాల్తో పన్లోకి దిగేరంతా.

"ఆపండెస్...ఆ బాబు మాగొప్ప పాటగాడట...మన పోసికోలుపాట విని నవ్వుకుంటాడు" అంటున్నాడు వెంకడు.

"ఏపాటి పాటగాడో...,మనంకూడా ఇందారేంటి..."

"పెద్ద పెద్దోళ్ళొస్తార్రా...మనదాకా ఎక్కడ...సరిసరి...బేగి పని కానియ్యండెస్..."

నవ్వుకున్నాడు శివశంకరం. అక్కడికి దగ్గర్లో సిమెంటుచప్టా కనిపించింది. అక్కడ ఆసీనుడయ్యేడు.

మఠం వేసుకుకూర్చుని చుట్టూచూసేడు శివశంకరం. అతని కళ్ళకి ఎక్కడ చూసినా విద్యుద్దీపాల కాంతే ! ఏవైపునా తలలూచే జన సందోహమే ! ఏవంకా మృదుమధుర సంగీత నాదమే ?

సంగీత సమాధిలోనికి ప్రవేశించినట్లుగా ఉంది.

అతనిని సంగీత సరస్వతి ఆవహించినట్టుగా గాంది.

ఎడమవైపు నుండి వాయులీనం, కుడిదిక్కుగా మృదంగ ఘట్టనం, వెనుక నుండి తంబుర నాదం అతనిని అమాంతంగా లేవనెత్తి సంగీత సాగరంలోకి విసిరేసి నట్టూ...అందులో తలమునకలై కొట్టుకుపోతున్నట్టూ వుంది శివశంకరానికి.

"తోం...తోం...దిరిదిరితోం...నాదిరిదిరిదిరి..."

తిల్లాన అతని నోటినుండి ప్రవహించసాగింది. ఆ ప్రదేశమంతా స్వేచ్ఛా విహారం చేసి తిరిగి అతని మనసులోకే ప్రవహించి ఇంకిపోతోంది.

స్వరజతులు వింతగా మేళవిస్తున్నాయి. చెవులకు సంగీతప్రియులు ప్రోత్సాహకరంగా చేస్తున్న చప్పట్లు తప్ప ఇంకేం వినిపించడంలేదు. కనులకు శృంగారాన్ని ఒలకబోస్తూ తను కూర్చున్న తిల్లాన ఘరింతగా రసమయం చేస్తూ అభినయిస్తున్న నర్తకి తప్ప ఏమీ కనిపించడంలేదు.

"అమ్మో..." అన్నకేకతో చుట్టూ పొగమంచులా ఆవరించుకున్న వాతావరణం పటాపంచలయ్యింది.

ఏం జరిగిందో ఒక్కక్షణం అర్థంకాలేదు శివశంకరానికి.

అదిగో !

మంటపం దగ్గర మూగివున్నారు.

ఏవిటేవిటేవిటయ్యింది ?

తపోభంగమేకాదు, రసభంగం కూడా పొందిన శివశంకరానికి కోపం రాలేదు. గగ్గోలుతో ఆత్రుత హెచ్చింది.

నెమ్మదిగా లేచి అటువైపు నడిచాడు.

అంతదూరంలోనే కనిపించిన దృశ్యం నిశ్చేష్టుడిని చేసింది.

వెంకడు !

పడివున్నాడు. పందిరిమీది నుండి పడ్డట్టున్నాడు.

వెంకడి పక్కనే వాడి పెళ్ళాం కామోసు.

"నన్నూ, పిల్లల్ని ఎలా బతకమన్నావురో దేవుడో" అంటూ పడిఏడుస్తోంది. ఆ ప్రాంగణంలోనే ఓ మూలగావున్న వెంకడి గుడిసెనుండి విలవిలలాడుతూ కేరు కేరుమంటూ వాడి పిల్లలు కామోసు పరిగెత్తుకు వస్తున్నారు.

అప్పటికప్పుడో నిర్ణయానికి వచ్చినట్టుగా కూలీలంతా "పట్టండెహే..." అని ఒకరినొకరు అనుకుంటూ వాడ్ని మోసుకుపోతున్నారు. ఆత్రుత అడుగంటుతోంది. అంతస్తు అడ్డు పడుతోంది. అయినా అంతా అర్థమయిపోతోంది...వాళ్ళు తీసుకుపోతున్నది ధర్మాసుపత్రికని.

అక్కడినుండి తిరిగివస్తాడా వెంకడు ?

మనసు వికలమైపోయింది శివశంకరానికి. తిల్లానా కకావికలైపోయింది. పల్లవి, అనుపల్లవి అత్యంత రమణీయంగా, శృంగార రసమయంగా వచ్చింది. ఇక చరణం మిగిలిపోయింది.

అంతవరకూ చేసిన అభినయానికి చరణం ఒక రూపు నిస్తుంది; కాని దాని కూర్పు ఆగిపోయింది.

వాళ్ళంతా వెళ్ళిపోగానే తిరిగి చప్టామీద కూర్చున్నాడు శివశంకరం.

అంతవరకూ కలకలంతో కూడిన నిశ్శబ్దం కళకళలాడింది. కన కళల మాధురి ప్రపంచింది. ఇప్పుడు ? కీచు రాళ్ళ కీచుశబ్దాలతో నిశ్శబ్దం బీభత్సంగా ఉంది.

తల విదిలించేడు. కాని తలకు పట్టిన బాధచెదరలేదు. కళ్ళుమూసుకున్నాడు కంటిపాపమీద తెరమీది బొమ్మలా వెంకడి నిర్జీవుడై పడివున్న అవస్థ కనిపిస్తోంది. శక్తినంతా కూడదీసుకుని చరణం కూర్చబోయేడు. కాని ఎంత ప్రయత్నించినా విఫలుడే అయ్యేడు శివశంకరం.

మర్నాడు...

వెంకడు చచ్చిపోయినందుకు కార్యక్రమం ఆగిపోలేదు.

దేశమంతా మారుమోగిన శివశంకరం పేరు విని...ఆ మహదవకాశం వినియోగించుకోవడానికి ఊరు ఊరంతా పొర్లి ప్రవహించింది, వెంకడు అలంకరించిన పందిట్లోకి.

సభా ప్రారంభంలో అఖండసత్కారంతోపాటు అనుకోని బహుమానంకూడా ముట్టింది శివశంకరానికి.

కచేరీలో...

తంబురనాదం; వాయులీనం; మృదంగ దరువూ అతనిని ప్రోత్సహిస్తూంటే "తోం,,,తోం...దిరిదిరితోం...నాదిరి దిరిదిరి..." అంటూ చరణంవరకూ హోరుమంటూ ప్రవహించింది తిల్లానా.

కాని...

అక్కడ..., చరణం దగ్గర...

కంటి ముందరి ఆకారం...మనసులో పేరుకున్న జాలీ...,గొంతులో ఉండ చుట్టిన బాధా...శివశంకరాన్ని పలకనివ్వలేదు.

జనం...,

గడబిడ చేస్తున్నారు...

కేకలేస్తున్నారు...

చెప్పులు విసరబోతున్నారు...

తిట్లు కుమ్మరిస్తున్నారు...

శివశంకరానికి కర్తవ్యం వెలుగుదారి చూపినట్లుగా గంభీరంగా లేచేడు. నెమ్మదిగా వేదికదిగి...జనం మధ్యగా...ఆ మూలనున్న వెంకడి గుడిసెవైపు... భుజాలమీద మన్న శాలువాతో పాటు చేతిలోని బహూమానంతో సహా నడవసాగేడు.